


చంద్రన్న మాట..

ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి

రెండెకరాల్లో వక్క సాగు చేశా. ధరలు, దిగుబడులు లేక నష్టపోతున్నా. వక్క పంటకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే కూలీ ఖర్చులు తగ్గుతాయి. ప్రస్తుతం కూలిరేట్లు కూడా అధికంగా ఉన్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో వక్క దిగుబడి 70శాతంపైగా తగ్గింది. ధరలు కూడా లేవు. పెట్టిన ఖర్చులు కూడా చేతికి అందడం కష్టంగా ఉంది. గిట్టుబాటు ధర కల్పించి, స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- తిప్పేస్వామి, రైతు, కెంకర



ఆశలు చిగురించెనంట!

- మడకశిర రైతుల్లో హర్షాతిరేకాలు
- నెరవేరనున్న ఏళ్ల కల
- తగ్గనున్న రవాణా చార్జీలు
- ఎంతో మందికి దక్కనున్న ఉపాధి

వక్క మార్కెట్ నిర్మాణానికి సీఎం హామీ

ఆరబెట్టిన వక్కలు







ధర లేక ఇళ్ల వద్దే నిల్వ ఉంచుకున్న వక్క దిగుబడి

మడకశిర, ఆగస్టు 9: వేల హెక్టార్లలో వక్క పంట సాగుచేస్తున్నారు మడకశిర ప్రాంత రైతులు. పంట పండించడం ఒక ఎత్తయితే.. అమ్ముకోవడం మరో ఎత్తు. అదొక పెద్ద ప్రహసనమే అని చెప్పాలి. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లాలి, అక్కడ దళారులు అడిగిన రేటుకు పంట దిగుబడి అమ్ముకోవాలి. ఇలా రవాణా చార్జీలు భరించాల్సి వస్తోంది. అదేవిధంగా దళారీల చేతిలో దోపిడీ అవుతున్నారు. స్థానికంగానే వక్క మార్కెట్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ఈ ప్రాంత రైతులను కోరుతున్నారు. వారి ఏళ్ల కల కూడా. గత టీడీపీ హయాంలో ఐదేళ్ల క్రితం మడకశిరలో వక్క మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆ మేరకు నిధులు కూడా మంజూరు చేసింది. దీంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ.. అన్నదాతల ఆశలపై నీళ్లు కుమ్మరించింది. వక్క మార్కెట్ నిర్మాణం అటకెక్కింది. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకున్న వైసీపీ పాలకులు అన్నదాతలకు ఎంతో ఉపయోగకరమైన వక్క మార్కెట్ నిర్మాణం ఊసే ఎత్తకపోవడం శోచనీయం. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 1న మడకశిర మండలం గుండుమల గ్రామానికి పింఛన్ల పంపిణీకి వచ్చిన చంద్రబాబు.. రైతులతో మాట్లాడారు. వక్క మార్కెట్ నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వక్క మార్కెట్ నిర్మిస్తే రైతులు పంట దిగుబడిని స్థానికంగానే అమ్ముకోవచ్చు. తద్వారా రవాణా ఖర్చులు తప్పనున్నాయి. ధర వచ్చినపుడు తెలుసుకుని మరీ.. వక్కను మార్కెట్‌కు తరలించవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి ట్రేడర్లే వస్తారు కనుక, పంటకు మరింత ధర లభించే అవకాశం ఉంటుంది. అంతేకాదు, చాలామందికి ఉపాధి కూడా లభిస్తుంది.

15వేల హెక్టార్లలో వక్క సాగు

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో నీటి వనరులు తక్కువ. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఈ ప్రాంత రైతులు దాదాపు 15వేల హెక్టార్లలో వక్క పంట సాగుచేశారు. గత రెండేళ్లలోనే రెండు వేల హెక్టార్లలో వక్క పంట పెట్టినట్లు సమాచారం. వక్క మొక్క ఒక్కసారి నాటితే వందేళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. ఏటా నియోజకవర్గంలో రూ.100 కోట్లదాకా వక్క లావాదేవీలు సాగుతాయి. గత టీడీపీ హయాంలో రైతుబంధు పథకం తీసుకొచ్చి, అన్నదాతలకు వడ్డీలేని రుణాలు అందించేవారు. మార్కెట్‌లో ధరలు లేకపోతే పండించిన పంటను గోదాముల్లో నిల్వ ఉంచుకునే వీలు కల్పించేవారు. రూ.3 లక్షల విలువచేసే వక్క దిగుబడిని తాకట్టు పెడితే మార్కెట్ ద్వారా వడ్డీ లేకుండా రూ.2 లక్షల వరకు రుణం ఇచ్చేవారు. ఆరు నెలల వరకు వక్క దిగుబడికి వడ్డీ ఉండదు. ఆ తరువాత 50 పైసలు వడ్డీ 9 నెలల వరకు ఉంటుంది. అనంతరం వక్కను విక్రయించుకోవాల్సి ఉంటుంది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక రైతుబంధు పథకాన్ని అటకెక్కించింది. దీంతో అన్నదాతలు పంట దిగుబడిని నిలువ ఉంచుకునే అవకాశం లేక, దళారులు అడిగిన రేటుకే అమ్ముకుని, నష్టపోతున్నారు.

తప్పనున్న దళారుల బెడద

గత టీడీపీ హయాంలో వక్క మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.3.90 కోట్లు మంజూరు చేసింది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు యార్డు నిర్మాణం ఊసే పట్టించుకోలేదు. ఆ నిధులు కాస్తా వెనక్కి మళ్లాయి. దీంతో మార్కెట్‌యార్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఈనెల 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుండుమల పర్యటన సందర్భంగా మార్కెట్ యార్డు నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ఏర్పాటు చేస్తే దళారుల బెడద తప్పనుంది. ట్రేడర్స్ నేరుగా వక్కను కొనుగోలు చేయడానికి ఇక్కడికే వస్తారు. రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయి.

అనుబంధ సంస్థలు ఏర్పాటు చేయాలి

మార్కెట్ యార్డుతోపాటు అనుబంధ సంస్థలు ఏర్పాటు చేస్తే వక్కకు మరింత ధర పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఇక్కడ పండించే పంటకు మార్కెట్ సౌకర్యంలేక రైతులు కర్ణాటకలోని బీమ సముద్రం, తుమకూరు, గుబ్బి, హిరియూరు, శిర తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి, అమ్ముకోవాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రవాణా చార్జీలు తగ్గనున్నాయి. ధరలు ఉన్నపుడు అమ్ముకునే వీలు ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. మార్కెట్ యార్డుతోపాటు అనుబంధ పరిశ్రమలు నెలకొల్పితే వక్కకు మరింత ధర వచ్చే అవకాశం ఉంటుంది. ఎంతోమందికి జీవనోపాధి లభిస్తుంది.



పచ్చి వక్కను ఉడకబెడుతున్న రైతులు

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



నాకు నాలుగెకరాల వక్క తోట ఉంది. ఎకరాలో 400 చెట్లు పెంచుతున్నా. దిగుబడులు బాగావస్తే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వస్తుంది. పెట్టుబడి పోను రూ.2.5 లక్షల వరకు మిగులుతుంది. ఈ యేడు దిగుబడులు లేకపోవడంతో ఎకరాకి లక్ష రూపాయాలు కూడా రావడం కష్టంగా ఉంది. కర్ణాటక మార్కెట్లకు తరలించాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి. పక్క రాష్ట్రంలో గిట్టుబాటు ధరలు లభించడం కూడా కష్టమే. ఈ నేపథ్యంలో స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలి.

- శివకుమార్, రైతు, హేమావతి

మంత్రి సవితకు అరుదైన అవకాశం

అగస్టు 15న జెండాను ఆవిష్కరించనున్న మంత్రి



పుట్టపర్తి, ఆగస్టు 9: బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు అరుదైన అవకాశం దక్కింది. జిల్లాకేంద్రంలో ఈనెల 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 15న జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై, జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటయ్యాక మొదటిసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున సవిత పోటీచేసి, జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య వేడుకల్లో పతాకావిష్కరణకు ఆమెకు అవకాశం కల్పించారు.

గిరిజన బిడ్డలు బాగా చదువుకోవాలి

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 9: గిరిజన బిడ్డలు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు చేరాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్పెషల్‌డ్రైవ్‌ద్వారా ఆధార్‌కార్డులు లేని గిరిజనులందరికీ తక్షణమే అందజేస్తామన్నారు. జనన ధృవీకరణ పత్రాలను జారీ చేస్తామన్నారు. తండాల్లో మండల ప్రత్యేక అధికారులు పర్యటించి, సమస్యలపై నివేదికలు అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోహనరామ్ పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 9: జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అత్యధికంగా కొత్తచెరువులో 39.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఓబుళదేవరచెరువు 31.2, పెనుకొండ 29.4, బుక్కపట్నం 23.6, ముదిగుబ్బ 23.2, పరిగి 20.2, లేపాక్షి 20.0, పుట్టపర్తి 18.4, తనకల్లు 18.0, గుడిబండ 16.2, చెన్నేకొత్తపల్లి 15.4, నంబులపూలకుంట 11.2, నల్లమాడ 9.8, ధర్మవరం 6.2, నల్లచెరువు 5.8, హిందూపురం 4.8, బత్తలపల్లి, అమరాపురం, గోరంట్ల, చిలమత్తూరు 4.2, మడకశిర 2.6, రొళ్ళలో 2.4 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు.

అందరికీ గృహయోగం

- క్షేత్రస్థాయిలో పరిశీలన..
- వందరోజుల్లో నిర్మాణాల పూర్తికి కసరత్తు
- గృహనిర్మాణ సంస్థకు లక్ష్యం



కొత్తచెరువు వద్ద బేస్‌మెంట్ స్థాయిలో ఆగిన ఇళ్ల నిర్మాణం

పుట్టపర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంజూరైన పేదల పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. చాలాచోట్ల నిర్మాణాలే ప్రారంభం కాలేదు. 2019 ఎన్నికల సందర్భంగా పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని వైసీపీ అధినేత జగన్ హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక దానిని విస్మరించారు. జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామంటూ వైసీపీ నేతలు గొప్పలు చెప్పుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు కాదు.. ఊళ్లు కడతామంటూ మాజీ సీఎం జగన్ ప్రగల్భాలు పలికారు. వారి మాటలు విని లేఅవుట్లకు వెళ్లిన పేదలకు బొమ్మ కనబడింది. కొండగుట్టల్లో పట్టాలిచ్చి, నిర్మాణాలు మొదలు పెట్టాలని ఒత్తిళ్లు పెట్టారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థలాల విస్తీర్ణం తక్కువగా ఉడంటంతో చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. చాలా లేఅవుట్లు పట్టణ, గ్రామాలకు దూరంగా కొండగుంటలు, లోతట్టు ప్రాంతాల్లో ఉండడంతో వర్షాకాలంలో మడుగులను తలపిస్తున్నాయి. రహదారులు నిర్మించాక మట్టి రోడ్లన్నీ బరదమయమవుతున్నాయి. ఈనేపథ్యంలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు లబ్ధిదారులు అనువైన పరిస్థితులులేక చేతులెత్తేశారు. ఇంటి నిర్మాణంపై ఆసక్తి చూపకపోగా.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఎన్నికల హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. ఈనేపథ్యంలో జిల్లాలో వంద రోజుల ప్రణాళికతో పూర్తికి జిల్లావారీగా ఇళ్ల లక్ష్యాలను నిర్దేశించింది.

అందరికీ ఇళ్లు

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో 66,393 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి 22,417 మాత్రమే పూర్తిచేశారు. ఏడు నియోజకవర్గాల్లో 298 జగనన్న లేఅవుట్లలో 30,985, సొంత స్థలాల్లో 28918 మంది కలిపి మొత్తం 59903 ఇళ్ల నిర్మాణం మెదలు పెట్టారు. జిల్లావ్యాప్తంగా 43,976 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో 14,885 ఇళ్లు మొదలే కాలేదు. 7,209 గోడ నిర్మాణానికి అడ్వాన్సు కింద రూ.8.20 కోట్లు ఇచ్చారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వందరోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలో 2,800 గృహాల నిర్మాణంతోపాటు వివిధ దశల్లో ఉన్న 25వేల ఇళ్లను స్థాయి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈమేరకు గృహనిర్మాణ శాఖ మంత్రి ఇటీవల రాష్ట్ర, జిల్లాస్థాయి గృహనిర్మాణ సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. 2016 నుంచి 2019 దాకా ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద మంజూరైన 23,647 మంది లబ్ధిదారులకు రూ.32.04 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిలో రూఫ్‌లెవల్, పూర్తయిన ఇళ్లకు బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లాలో జగనన్న లేఅవుట్లకు భూసేకరణలో వైసీపీలో కీలక ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. వంద రోజుల ప్రాణాళికలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణానికి చర్యలు మొదలుపెట్టారు. మంజూరైన ఇళ్ల నిర్మాణం వచ్చే మార్చి 25 నాటికి కచ్చితంగా పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ.. లబ్ధిదారులకు సూచిస్తోంది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం

వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాం. గడువులోగా లక్ష్యాలు పూర్తిచేస్తాం. బిల్లుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి 25లోగా పూర్తి చేయాలి. 2016-19 మధ్య మంజూరైన ఇళ్లకు సంబంధించి రూఫ్‌లెవల్, పూర్తయిన వాటికి బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

- వెంటకనారాయణ, పీడీ, గృహనిర్మాణ సంస్థ

పోలీసు సమస్యలపై 27 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని డీపీఓలో శుక్రవారం నిర్వహించిన పోలీసు సిబ్బంది ఫిర్యాదుల పరిష్కార వేదికలో 27 ఫిర్యాదులు అందాయి. వాటిని ఏఎస్పీ విష్ణు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బదిలీలు, సస్పెన్షన్ రీవోక్, సరెండర్ లీవ్ తదితర సమస్యలపై పోలీసు సిబ్బంది ఫిర్యాదులను అందజేశారు. నిబంధనల మేరకు వాటిని పరిష్కరిస్తామని ఏఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.



డీపీఓలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ విష్ణు

సీఐల బదిలీ.. డీఐజీ ఉత్తర్వులు

అనంతపురం క్రైం, ఆగస్టు 9: ఉమ్మడి జిల్లాల పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు సీఐలను వీఆర్‌కు పంపగా, మరికొందరికి పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలుగా బదిలీ చేశారు. మొత్తం 28 మంది సీఐలను బదిలీ చేశారు. మరికొందరు సీఐల బదిలీలు కావాల్సి ఉంది. అనంతపురం పరిధిలో వన్‌టౌన్, రూరల్ సీఐ స్థానాలను పెండింగ్‌లో ఉంచారు. త్వరలో వాటితో పాటు గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, రాయదుర్గం, మడకశిర, ధర్మవరం ప్రాంతాల్లో బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సాయినాథ్	వీఆర్, ఏఆర్,అనంతపురం	ఫోర్త్‌టౌన్,ఏటీపీ
ప్రతాప్‌రెడ్డి	ఫోర్త్‌టౌన్,అనంతపురం	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
రఘుప్రసాద్	సెబ్,అనంతపురం	ట్రాఫిక్,ఏటీపీ
నారాయణరెడ్డి	ట్రాఫిక్,ఏటీపీ	కదిరి పీఎస్
పుల్లయ్య	కదిరి పీఎస్	వీఆర్,ఎస్పీ,సత్యసాయి
శ్రీధర్	శింగనమల సర్కిల్	బుక్కరాయసముద్రం
వెంకటేశ్వర్లు	బుక్కరాయసముద్రం	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
రాజేంద్రనాథ్	నల్లమాడ	కళ్యాణదుర్గం రూరల్ యూపీఎస్
చంద్రశేఖర్	కళ్యాణదుర్గం రూరల్	వీఆర్,ఎస్పీ, ఏటీపీ
నీలకంఠేశ్వర్	ఇంటెలిజెన్స్, ఏటీపీ	కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్
నాగరాజు	కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్	వీఆర్,ఎస్పీ, ఏటీపీ
ఇందిర	ఎస్పీ, అనంతపురం	కొత్తచెరువు యూపీఎస్
రాజారమేష్	కొత్తచెరువు యూపీఎస్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
జగన్‌మోహన్‌రెడ్డి	డీటీసీ, తిరుపతి	వీఆర్, ఎస్పీ, ఏటీపీ
జనార్దన్	సీసీఎస్, ఏటీపీ	హిందూపురం రూరల్ సర్కిల్
శ్రీనివాసులు	హిందూపురంరూరల్ సర్కిల్	వీఆర్, ఎస్పీ, శ్రీ సత్యసాయి
శేఖర్	వీఆర్, ఎస్పీ, ఏటీపీ	గోరంట్ల యూపీఎస్
సుబ్బరాయుడు	గోరంట్ల యూపీఎస్	వీఆర్ ఎస్పీ,శ్రీసత్యసాయి
సురేష్	వీఆర్, ఎస్పీ, చిత్తూరు	పుట్టపర్తి రూరల్ సర్కిల్
రాగిరి రామయ్య	పుట్టపర్తి రూరల్ సర్కిల్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
సునీత	డీటీసీ, పుట్టపర్తి	పుట్టపర్తి అర్బన్ పీఎస్
కొండారెడ్డి	పుట్టపర్తి అర్బన్ పీఎస్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
శాంతిలాల్	వీఆర్,అనంతపురం	అనంతపురం త్రీటౌన్
ధరణికిషోర్	అనంతపురం త్రీటౌన్	ఎస్పీ, అనంతపురం
హేమంత్‌కుమార్	సైబర్ క్రైం,శ్రీ సత్యసాయి	ఇటుకలపల్లి సర్కిల్
నరేంద్రరెడ్డి	ఇటుకలపల్లి సర్కిల్	వీఆర్,ఎస్పీ,అనంతపురం
శ్రీ హర్ష	డీసీఆర్‌బీ, శ్రీ సత్యసాయి	రాప్తాడు యూపీఎస్
మునిస్వామి	రాప్తాడు యూపీఎస్	వీఆర్,ఎస్పీ,అనంతపురం

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 9: వెలంకని ఉత్సవాల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ముంబై-వెలంకని మధ్య గుంతకల్లు మీదుగా ప్రత్యేక (ధరల) రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ముంబై-వెలంకని (నెం. 01161) ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ముంబైలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3:05 గంటలకు గుంతకల్లుకు వచ్చి, రాత్రి 11:50 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 01162) వెలంకనిలో 28వ తేదీ ఉదయం 3 గంటలకు బయలుదేరి రాత్రి 12 గంటలకు గుంతకల్లుకు వచ్చి మరుసటి రోజు సాయంత్రం 4:20 గంటలకు ముంబైకు చేరుతుందన్నారు. ముంబై-వెలంకని (నెం. 01163) ప్రత్యేక రైలు ముంబైలో సెప్టెంబరు 7వ తేదీన, దాని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 01164) వెలంకనిలో సెప్టెంబరు 9వ తేదీన పై న తెలిపిన సమయాల్లోనే బయలుదేరి గమ్యాలకు అవే సమయాల్లో చేరుకుంటాయన్నారు. ఈ రైళ్లు థానే, కళ్యాణ్, లోనావాలా, పూణే, డౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, కడప, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, వెల్లూరు కంటోన్మెంటు, తిరువన్నామలై, విల్లుపురం, పన్రుతి, తిరుపద్రిపుల్యూరు, చిదంబరం, సిర్కాజి, వైతిస్వరణ్ కోయిల్, మయిలదుతురై, తిరువన్నూర్, నాగపట్టణం స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు.

బెంగళూరు-కలబురగి మధ్య..

ప్రయాణికుల రద్దీ నియంత్రణకు మూడు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు-కలబురగి (నెం. 06533) ప్రత్యేక రైలును ఈ నెల 14, 16, 17 తేదీల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు పేర్కొన్న తేదీల్లో రాత్రి 9:15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:45 గంటలకు కలబురగికి చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06534) కలబురగిలో ఈ నెల 15, 17, 18 తేదీల్లో ఉదయం తొమ్మిదిన్నరకు బయలుదేరి అదేరోజు రాత్రి 8గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, షాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

టీబీ డ్యాంలో 105 టీఎంసీల నిల్వ

బొమ్మనహాళ్, ఆగస్టు 9: తుంగభద్ర జలాశయంలో 105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గురువారం 48,439 కూసెక్కులు ఉండగా.. ఇన్‌ఫ్లో రావడంతో శుక్రవారం సాయంత్రానికి 53,654 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 5 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నదికి 12,464 క్యూసెక్కులు, కాలువలకు 10,445 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 22,909 క్యూసెక్కుల నీటిని బయటికి వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శుక్రవారం సాయంత్రం నాటికి 1632.93 అడుగులతో 105.507 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 వ కి.మీ. వద్ద 1320 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 9: సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ స్కీమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ రెండు పథకాల ద్వారా రెండు వేల గ్రామాలకు తాగు నీరు అందించేందుకు ఎన్నో సంవత్సరాలుగా 1300 మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. ఆ సంస్థలను నిర్వీర్యం చేసి, రద్దు చేసే కుట్రలో భాగంగా 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్ కమిటీ రిపోర్ట్ ఇచ్చిందని అన్నారు. దీనివల్ల సగం మంది కార్మికులు ఉద్యోగాలను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పనిభారంతో ఉన్న కార్మికులకు పొమ్మనకుండా పొగపెడుతున్నారని అన్నారు. ఇలాంటి రిపోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాలని, సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఐఎఫ్‌టీయూ నాయకులు ఉపేంద్ర, రాము పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన చేపడుతున్న వాటర్ వర్క్స్ స్కీమ్‌ల కార్మికులు

ఉనికి కోసం వైసీపీ నాటకాలు

జగన్‌ది ప్రస్తుతం క్రికెట్ టీమ్
ఆఖరుకు మిగిలేది షటిల్ జట్టే
మంత్రి సవిత ఎద్దేవా


రోడ్‌షోలో విజయ సంకేతం చూపుతున్న మంత్రి సవిత

గోరంట్ల, ఆగస్టు 9: అధికారం ఉందికదా అని అరాచకాలకు పాల్పడిన గత వైసీపీ పాలకులు నామరూపాల్లేకుండా పోయారనీ, ప్రస్తుతం ఉనికి కోసం నాటకాలు ఆడుతున్నారని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలో మంత్రి శుక్రవారం పర్యటించారు. రోడ్ షో, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గోరంట్లలోని బస్టాండు కూడలిలో ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల నియంత పాలన తరువాత వైసీపీ నాయకులు ఉనికి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారు రక్తి కట్టించాలని చేసిన సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. పులివెందుల రెడ్డి (జగన్)కే ఉనికి లేదనీ, ఇక మిగిలిన వారి పరిస్థితి చెప్పక్కర్లేదన్నారు. క్రికెట్ టీమ్ తరహాలో జగన్ టీమ్‌లో ప్రస్తుతం 11 మంది ఉన్నారనీ, ఆఖరుకు మిగిలేది షటిల్ టీమ్ మాత్రమే అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో భూఅక్రమాలు, దందాలపై ఉన్నతస్థాయి విచారణ చేయిస్తామని మంత్రి ప్రకటించారు. మండలంలో ప్రైవేటు, ప్రభుత్వ భూములను అక్రమంగా దోచుకున్నారన్నారు. ఒకొక్కటిగా వెలికి తీసి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం గోరంట్లలోని ఆంజనేయస్వామి కాలనీలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. మంత్రి హోదాలో తొలిసారి గోరంట్లకు వచ్చిన సవితకు అడుగడుగునా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఇంటికెళ్లి ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి, మంత్రి జ్ఞాపిక అందజేశారు. నిమ్మలకుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంత్రి పర్యటనలో పెద్దఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లో ఎర్రచందనం సాగు లాభసాటి కాదు

ఇతర పంటల సాగుపై అవగాహన కల్పించండి
అధికారులకు పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి సూచన


ఎర్రచందనం మొక్కలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9: పంట పొలాలలో ఎర్ర చందనం పెంపకం అంత లాభసాటి కాదని పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. రైతులకు ఇతర పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. వడ్డుపల్లి సమీపంలో సోషల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దీప ఆధ్వర్యంలో ఆర్డీటీ ఎకాలజీ సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. పొలం చుట్టూ నాటిన ఎర్ర చందనం మొక్కల పరిశీలించారు. ఎర్ర చందనం సాగు గురించి రైతులకు అవగాహన కల్పించడం మంచిదేనని, కానీ ఏ పదేళ్లకో అవి చేతికి వస్తాయని అన్నారు. వాటి మార్కెట్ గురించి రైతులకు తెలియదని, పైగా రంగు రాకపోతే వాటిని ఎవరూ కొనరని అన్నారు. తద్వారా రైతులు నష్టపోతారని అన్నారు. అక్కడికి సమీపంలో చీనీ తోటను పరిశీలించారు. ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని, రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. తన పొలంలో పది ఎర్రచందనం మొక్కలను పెంచానని, అవి పెరిగి పెద్దవైనా ఎవరూ కొనడం లేదని ఓ రైతు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రంగు రాకపోతే మార్కెట్‌లో కొనుగోలు చేయరని, ఇలాంటి వాటి జోలికి వెళ్లవద్దని ఆయన రైతులకు సూచించారు. మార్కెట్‌పై అవగాహన లేకుండా ఎర్రచందనం మొక్కలను పొలాలలో పెంచవద్దని, అడవులలో పెంచవచ్చని సూచించారు.

కార్యాలయ పరిశీలన

అనంతపురం నగరంలోని సీఎఫ్ కార్యాలయాన్ని పీసీసీఎఫ్ పరిశీలించారు. విధులు నిర్వహించేచోట కలపను నిల్వ చేయడం సరికాదని అన్నారు. డీఎఫ్ఓ, సోషియల్ ఫారెస్ట్, రేంజర్, డీఆర్వో కార్యాలయాలను ఆయన పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. భవనాల మరమ్మతులు, లైటింగ్, రంగులు తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. టెరిటోరియల్ కార్యాలయంలోని ఒక గదిలో కలప నిల్వ చేయడంతో వెంటనే మరోచోటుకు మార్చాలని రేంజర్‌కు సూచించారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ వినీత్ కుమార్‌తో శాఖపరమైన అంశాలపై చర్చించారు.

పర్యాటక ప్రాంతంగా మార్చండి

పంపనూరు నగరవనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పీసీసీఎఫ్ సూచించారు. సీసీఎఫ్, డీఎఫ్ఓతో కలిసి నగరవనాన్ని పరిశీలించారు. సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సమీపంలో ఉన్న జింకలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నగరవనంలో కలియతిరిగి.. అభివృద్ధి పనులకు సూచనలు చేశారు. హైవే సమీపంలో ఉన్నందున రోడ్డు హద్దులు చూసుకొని మొక్కలు నాటించాలని సూచించారు. నగర వనంలో మొక్కలను బాగా నాటారని, నిర్వహణ మరింత మెరుగుపడాల్సి ఉందని అన్నారు. రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్‌కు పలు సూచనలు చేశారు. పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. స్క్వాడ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి, రేంజర్లు శ్రీనివాసులు, డేవిడ్, వెంకటేశులు, డీఆర్వో ఉసేనప్ప, ఎఫ్‌బీఓలు జగదీష్‌యాదవ్, తేజేశ్వర్‌రెడ్డి, ఏబీఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు

తిరిగి విధుల్లోకి తీసుకోండి
కలెక్టరేట్ ఎదుట ఎస్పీవోల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 9: 'మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు.. మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీవోలు) వేడుకున్నారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన స్పెషల్ పోలీసులు శుక్రవారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వర్షం కురుస్తున్నా కూడా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ధర్మచందు మాట్లాడుతూ.. జీవో నెంబరు 111 ప్రకారం మాజీ ఆర్మీ జవానులు, సివిల్ వ్యక్తులతో కలిపి ఏపీ స్పెషల్ ఆఫీసర్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 2,156 మందిని పోలీసు శాఖకు అనుసంధానంగా గత ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో రాత్రీపగలు విధులు నిర్వహించి.. ఎర్రచందనం, మద్యం, గంజాయి తదితరాల అక్రమ రవాణాను నిరోధించామన్నారు. అయినా గత ప్రభుత్వం 18 నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. జీతాల కోసం ఆందోళన చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వ పెద్దలు మాయ మాటలుచెప్పి విరమింపజేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు.. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తమ సమస్యలను అనేక వేదికలపై ప్రస్తావించారని, అధికారంలోకి వస్తే ఆదుకుంటామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్నట్టుండి తమను విధులనుంచి తొలగించారన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నారా లోకేష్ తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నా సందర్భంగా తిరుచానూరు పోలీసులు కలెక్టరేట్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లోకి కేవలం ముఖ్య నాయకులను మాత్రమే అనుమతించారు. కార్యక్రమంలో సుమారు 150 మంది ఎస్పీవోలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 9: సోమందేపల్లిలోని రాంబాబు కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మారుతీప్రసాద్(36) అప్పుల బాధ భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతీప్రసాద్ మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. మగ్గం గిట్టుబాటుకాక నష్టాల పాలయ్యాడు. రూ.3 లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అతడి భార్య శశికళ ఇంటికి తాళం వేసి, పని నిమిత్తం బయటికెళ్లింది. ఆ సమయంలో ఇంటికొచ్చిన మారుతీప్రసాద్ తాళాలు పగులగొట్టి, లోపలికి ప్రవేశించాడు. ఇంటి పైకప్పునకు చీరతో ఉరేసుకున్నాడు. కాసేపటికి ఇంటికొచ్చిన బంధువు.. మారుతీప్రసాద్ ఉరికి వేలాడుతుండడాన్ని చూసి వెంటనే చీరను కోసి, కిందికి దించాడు. భార్యకు సమాచారం అందించి, పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మారుతీప్రసాద్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నేతన్న ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మారుతీప్రసాద్‌కు కుమార్తె హర్షిత, కుమారుడు మధుసూదన్ ఉన్నారు.


మారుతీప్రసాద్ (ఫైల్)

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: యూటీఎఫ్

అనంతపురం విద్య, ఆగస్టు 9: ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీజీఎల్ఐ సూపరింటెండెంట్ కుళ్లాయప్పను యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు శుక్రవారం ఆయనను కలిశారు. జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీల వివరాలు అప్‌డేట్ చేయలేదని, పాలసీదారులకు పెంచిన మొత్తాల పాలసీ బాండ్లు జారీ చేయలేదని అన్నారు. వాటి సమాచారం కూడా ఉద్యోగులకు, టీచర్లకు అందడం లేదని అన్నారు. ఉద్యోగ విరమణ పొందినవారికి పాలసీ మొత్తాలు సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. పాలసీ గడువు పూర్తయినా ఫైనల్ చెల్లింపులు జరగడం లేదని, చనిపోయిన ఉద్యోగులకు కూడా పాలసీ సొమ్ము సకాలంలో చెల్లించడం లేదని అన్నారు. ఉద్యోగుల నుంచి నెల నెలా ప్రీమియం జమ చేసుకుంటున్నారని, అయినా మిస్సింగ్ క్రెడిట్స్ ఎక్కువగా ఉన్నాయని అన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్‌ను వెంటనే నమోదు చేయాలన్నారు. ఏపీజీఎల్ఐ ద్వారా ఉద్యోగులు, టీచర్లకు అందాల్సిన మొత్తాలను వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నారాయణ, శ్రీనివాసులు, చంద్రమోహన్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరేడ్‌కు విద్యార్థి ఎంపిక


సంజీవరాయుడు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పరేడ్‌కు పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల విద్యార్థి కే సంజీవ రాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. సంజీవరాయుడు కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థిగా కూడా ఉన్నాడన్నారు. ఆ విద్యార్థి పరేడ్‌కు ఎంపికవడంపై ఎన్ఎస్ఎస్ అధికారి నారాయణ, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివిన 18-28 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. బెంగళూరులో 35 రోజుల శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని అన్నారు. త్వరలో ప్రారంభించే శిక్షణకు పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9000487423లో సంప్రదించాలని కోరారు.

సొంత జిల్లాలకు ఎంపీడీఓలు

అనంతపురం విద్య, ఆగస్టు 9: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల నుంచి వచ్చిన 34 మంది ఎంపీడీఓలు వారి సొంత జిల్లాలకు వెళ్లనున్నారు. ఎంపీడీఓలను రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈఓ ప్రభాకర్ రావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి 33 మంది, నెల్లూరు జిల్లా నుంచి ఒక ఎంపీడీఓ జిల్లాకు వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎంపీడీఓలు 38 మంది ఎన్నికల ముందు కర్నూలు, కడప జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కర్నూలుకు 23 మంది, కడపకు 15 మంది బదిలీపై వెళ్లగా, కర్నూలులో రిలీవ్ చేశారు. వారు జిల్లాకు వస్తున్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, ఆగస్టు 9: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 3,300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 639టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 9: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జూన్, జూలైలో ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్23) రెగ్యులర్, (ఆర్15, 19, 20) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఒకటో సెమిస్టర్ (ఆర్15,19,20,23) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు 195 క్యూసెక్కుల నీరు


రెగ్యులేటర్ ద్వారా చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, ఆగస్టు 9: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 195 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.225 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు.

ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ హేమలత



అనంతపురం టౌన్, ఆగస్టు 9: ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జిల్లా సర్వజన వైద్యశాల డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో 2024-25 సంవత్సరానికి కమిటీని ఎన్నుకున్నారు. డాక్టర్ హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. జిల్లాకు చెందిన మరో ముగ్గురు డాక్టర్లకు స్టేట్ కమిటీలో చోటు కల్పించారు. అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ విభాగం చైర్మన్‌గా డాక్టర్ శ్రీనాథ్, ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ మనోరంజన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర కమిటీ అధికారికంగా వీరి ఎన్నికను ప్రకటించింది.

అవినీతిపరులపై కేసులు నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి ఆగస్టు 9 : స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో అక్రమాలకు పాల్పడిన ప్రిన్స్‌పాల్, మాజీ చైర్మన్‌పై కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... ఈ గురుకుల పాఠశాలలో ఐదు సంవత్సరాలుగా అనేక అక్రమాలు జరిగాయన్నారు. గత, ప్రస్తుత ప్రిన్స్‌పాళ్లు వైసీపీకి చెందిన మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌తో కలసి ప్రతి విద్యార్థి నుంచి సంవత్సరానికి రూ. 10 వేలు వసూరు చేశారని మండిపడ్డారు. ఇలా పాఠశాలలో మొత్తం 360 మంది విద్యార్థులుండగా.. సుమారు రూ. 30 లక్షలకు పైగా వసూలు చేశారని ఆరోపించారు. ఖాళీ సీట్లను ఒక్కో దాన్ని రూ. 50 వేలకు అమ్ముకున్నారన్నారు. ఇలా ఏటా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అంతే కాకుండా కాయగూరలు, చికెన్, పాలు తదితర వాటిని తక్కువ ధరకు తెచ్చి.. ఎక్కువ తెచ్చినట్లు బిల్లులు చేసుకొని భారీగా దోచేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ప్రిన్స్‌పాల్ రాజకీయ నాయకురాలిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా వైసీపీ చెందిన చంద్రశేఖర్‌కు నేల రోజుల ముందే ఇచ్చారని, అదే జాబితాను టీడీపీ వారు అడిగితే ఇవ్వలేదని, ఎన్నికలకు ముందు రోజు సాయంకాలం పూర్తి స్థాయిలో ఇవ్వకుండా 300 మందివి మాత్రమే ఇచ్చారని తెలిపారు. వీరి అవినీతిపై ఉన్నతాధికారులు స్పందించి విచా రణ చేయించి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శ్రీనివా సులు, చంద్రశేఖర్, ప్రతాప్, బీదాలనారాయణస్వామి, సదాశివ, బొజ్జప్ప, వీరనారప్ప పాల్గొన్నారు.

వెలిచెలమలలో పొలంబడి

నంబులపూలకుంట, ఆగస్టు 9: మండలంలోని వెలిచెలమలలో పొలంబడి కార్యక్రమాన్ని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయంపై తక్కువ ఖర్చుపెట్టి.. అధిక దిగుబడులు సాధించేలా పంటలు సాగు చేయాలని సూచించారు. సేంద్రీయ పద్ధతులో పంటలు పండించే రైతులకు ఇండిగ్యాప్ సర్టిఫికెటు ఇస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్యూఎంఎస్ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవాకేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓడీసీలో మాతృత్వ అభియాన్

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 9 : స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రభుత్వ వైద్యులు భాను ప్రకాష్‌నాయక్, కమల్‌రోహిత్ అవగాహన కల్పించారు. 62 మంది గర్భవతుల్లో 34 మందిని హైరిస్క్ వారిగా గుర్తించి ఉచిత స్కానింగ్‌కు సిఫార్సు చేశారు. గర్భవతులకు కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు కుమార్, పృథ్వీరాజ్ భోజనవసతి కల్పించారు.

ఎంవీ రమణకు నివాళి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 9: అనంతపురం జిల్లా సీపీఐ నాయకుడు ఎంవీ రమణ మృతికి మండలకేంద్రంలో పలువురు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి నాయుడు, సీనియర్ నాయకులు పూల శ్రీనివాసులు, మహిళ సంఘం నాయకులు రత్నాబాయి, సుధాకర్, రమణ, రమణప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన న్యాయాధికారి



బియ్యాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి

కదిరి లీగల్, ఆగస్టు 9 : కదిరి కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారాలు, భోజనం, కూరగాయలు, వాష్ రూములు, భద్రత విషయాలు తదితర వాటిపై ఆరా తీశారు. గోడలకు సున్నం వేయించాలని.. పెచ్చులు ఊడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పిల్లలతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. కదిరి - హిందుపురం ప్రధాన రోడ్డు నుంచి అప్రోచ్ రోడ్డు ఘోరంగా ఉందని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పంట నమోదు పరిశీలన

ముదిగుబ్బ, ఆగస్టు 9: మండలంలో కొడవండ్లపల్లి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని కదిరి ఏడీఏ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల పంటలకు సంబంధించిన తెగుళ్ళు, చీడ, పీడల సమస్యలపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రాయితీపై ప్రభుత్వం ఇస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లక్ష్మీ నరసింహులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని అల్లుగుండు గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఏఓ భారతి శుక్రవారం పరిశీలించారు. ప్రతి రైతూ సెప్టెంబరు 15లోపు ఈ పంట నమోదు తప్పకుండా చేసుకోవాలన్నారు.

బుక్కపట్నం : మండలంలోని కొత్తకోట, గూనిపల్లి గ్రామాల్లో ఈపంట నమోదుపై ఏఓ సతీష్‌బాబు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శంకర్, వీఆర్ఓ పోతులయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ధర్మవరంరూరల్, ఆగస్టు 9 : స్థానిక కోటలోని మున్సిపల్ ఉర్దూపాఠశాల విద్యార్థులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 95 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా అందులో నలుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామని ప్రభుత్వ కంటి వైద్యనిపుణుడు ఉరుకుందప్ప తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వహీదా, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

గాండ్లపెంట, ఆగస్టు 9: మండలంలోని 2023-24కు గాను చేపట్టిన ఉపాధి పనులపై గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. మండలంలో పలు పంచాయతీలో జరిగిన పంచాయతీరాజ్, సామాజిక పింఛన్లు, ఉపాధి పనులపైన సోషల్ అడిట్ బృందం వారు పరిశీలించారు. పనుల బిల్లులు కూలీలకు అందాయా లేదా అని విచారించారు. వేపరాల, తమ్మలబైలు పంచాయతీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం, ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

నాగులకట్టకు ప్రత్యేక పూజలు



ముదిగుబ్బ, ఆగస్టు 9 : నాగపంచమి సందర్భంగా ముదిగుబ్బలో శుక్రవారం భక్తులు, మహిళలు నాగులకట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు రాజేంద్రప్రసాద్, రఘునాథ శాస్త్రి భక్తులందరికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళలు, భక్తాదులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కొత్తచెరువు, ఆగస్టు 9: మండలంలోని మరకుంటపల్లి గ్రామంలో గ్రామస్థులు రూ. 50 లక్షలతో నిర్మించిన కుంటెమ్మ దేవి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపో ప్రారంభం : మండలంలోని మరకుంటపల్లిలో చౌకధాన్యపుడిపోను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు అందచేశారు.

వైసీపీ నాయకుల అవినీతి కనిపించలేదా..!

సామాజిక తనిఖీలో అధికారులను నిలదీసిన టీడీపీ నాయకులు



అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి ఆగస్టు 9 : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023 నుంచి 2024 వరకు రూ. 5,74,43,794తో పనులు చేపడితే.. కేవలం రూ. 2,66,512 అవినీతి మాత్రమే జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని టీడీపీ అధికారులు అధికారులను నిలదీశారు. యథేశ్చగా వైసీపీ నాయకులు అవినీతికి పాల్పడినా కనిపించలేదా అని ప్రశ్నించారు. మండలంలో పది రోజులుగా గ్రామాల్లో సామాజిక తనికి బృందం తిరిగి ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ పనుల్లో రూ. 2,66,512 అవినీతి జరిగినట్లు చెప్పారు. దీనిపై టీడీపీ నాయకులు మండి పడ్డారు. టీడీపీ నాయకులు సదాశివ, పోతు లక్క, రమణ, మనోజ్ మాట్లాడుతూ.. బత్తలపల్లి మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన ఉపసర్పంచ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులకు కూలి పనులకు వచ్చినట్లు ఎలా బిల్లులు ఇచ్చారని ప్రొసీడింగ్ ఆఫీసర్ శివశంకర్‌ని, ఏపీఓ ఆదెప్పను ప్రశ్నించారు. కొండంత అవినీతి జరిగితే.. అధికారులు మాత్రం గోరంతే జరిగినట్లు తెల్పడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతిపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాలను అధికారులకు చూపి తూ.. టీడీపీ నాయకులు ఓబులనాయు డు, బాలాంజినేయులు నిలదీ శారు. మండల వ్యాప్తంగా చేసిన పనులకే మళ్లీ బిల్లులు ఎలా మంజూరు చేస్తారని, అంగన్‌వాడీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులను కూలీలుగా ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఇన్ని అక్రమాలు జరిగినా... సామాజిక తనిఖీ బృందం గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వీటి పై కలెక్టర్, ప్రొసీడింగ్ అధికారికి ఫిర్యాదు చేసి.. మరోసారి విచారణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, నాగభూషణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



నాగేంద్రమ్మను సన్మానిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయ రైతుకు సన్మానం

బత్తలపల్లి ఆగస్టు 9 : బత్తలపల్లి మండలం గంటాపురానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు నాగేంద్రమ్మను శుక్రవారం విజయవాడలోని రాష్ట్రస్థాయి సమావేశంలో సన్మానించారు. రాష్ట్ర వ్యవసాయ చీఫ్ సెక్రటరి రాజశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ఈమె చేసిన కృషికి గత నెలలో పోర్చుగల్‌లో అవార్డు అందజేశారు. దీంతో ఆమెను శుక్రవారం విజయవాడలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కాకండి

ధర్మవరం రూరల్, ఆగస్టు 9: యువత మత్తుకు బానిసైతే జీవితం అంధకారమవుతుందని సెబ్ ఎస్ఐ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వివేకానంద డిగ్రీకళాశాలలో నిర్వహించిన యువత-భవిత అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి కేసులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణరెడ్డి, సెబ్‌సిబ్బంది రమేష్‌బాబు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు అన్యాయం

కళ్లకు గంతలు కట్టుకుని ప్రజాసంఘాల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 9: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ బడ్జెట్‌లో రైతులకు, కార్మికులకు నిధులు కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిందని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘం, చేనేత కార్మిక సంఘాల నాయకులు కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అనుకున్న విధంగా మానిటైజేషన్‌లో భాగంగా రైల్వేస్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకులను ప్రైవేటీకరణ చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. అదేవిధంగా కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను రద్దు చేసిందని, నాలుగు కోడ్‌లను రూపొందించిందని అన్నారు. ఇవి యాజమానులకు అనుకూలంగా.. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని, దీనిపై కార్మికులు పెద్దఎత్తున నిరసనలు తెలిపినా బీజేపీ పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ దిల్షాద్, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్ అయూబ్‌ఖాన్, రైతుసంఘం జిల్లా నాయకులు శేషంపల్లి మారుతి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

కొత్తచెరువు, ఆగస్టు 9 : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగు పరచాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ప్రభుత్వాన్ని కోరారు. కొత్తచెరువులో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, ఆరో ప్లీనరీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠశాలల నుంచి నెహ్రూ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్ మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేసిందన్నారు. దీంతో వాటి నిర్వహణ భారం వార్డెన్లకు తలకుమించిన భారంగా మారిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు కాస్మటిక్ చార్జీలు, మెస్‌చార్జీలు అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పెండింగ్ బిల్లులను చెల్లించాలని, హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు బాబావలి బాబ్జాన్, పవన్ కుమార్, జిల్లా సహాయ కార్యాదర్శి చంద్రశేఖర్, హర్షకుమార్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఓ, అకౌంటెంట్‌ను తొలగించండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నల్లమాడ, ఆగస్టు 9 : స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఓ రమాదేవి, అకౌంటెంట్ మంజులను విధుల నుంచి తొలగించాలని ఆ గ్రామస్థులు డీఈఓ మీనాక్షికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆమె శుక్రవారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు వచ్చారు. గ్రామస్థులు అక్కడికెళ్లి ఆమెకు వినతిపత్రం అందించారు. బాలికలు భోజనం, వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అకౌంటెంట్, ఎస్ఓల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్నారు. అక్కడ పనిచేస్తున్న వంట మనుషులను నానా బూతులు తిండుతూ మానసికంగా వేధిస్తున్నారన్నారు. అకౌంటెంట్ మంజుల ఇక్కడ 14 సంవత్సరాలుగా పనిచేస్తోందని, కూరగాయాల ఏజెన్సీ, బియ్యం, చెక్కీలు, పాలు, గుడ్లలో పర్సేటేజీలు తీసుకుని పిల్లల కడుపు కొడుతోందని ఆరోపించారు. వీటిపై ప్రశ్నిస్తే కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీకి ఎవరికైనా చెప్పుకోండి.. తనను ఏమీ చేయలేరని దౌర్జన్యానికి దిగుతోందని తెలిపారు. ఇటీవలే ఓ వంటమనిషి ఆమె వేధింపులు తట్టుకోలేక ఆత్మహ త్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. వీరిని వెంటనే విధుల నుంచి తొలగించి, బాలికలకు న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని డీఈఓ అన్నారు. కలెక్టర్ చేతన్ ఆ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామస్థులు ఆయనకు కూడా ఎస్ఓ, అకౌంటెంట్‌పై ఫిర్యాదు చేశారు.

రైతు సమస్యలపై ధర్నా



తనకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తనకల్లు, ఆగస్టు 9: రైతు సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిట్టుబాటు ధరలకు చట్టబద్రత చేయాలని అన్నారు. తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీవీ రమణ, సీఐటీయూ నాయకులు ఒంటెద్దు వేమన్న, రైతులు పాల్గొన్నారు.

నల్లచెరువు : రైతు సమస్యలు పరిష్కరించాలంటూ క్విట్ ఇండియా స్ఫూర్తితో రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక పోస్టాఫీసులో పోస్టుమాస్టార్ వెంకటనాయక్‌కు రైతు సమస్యలపై వినతిపత్రం అందించారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు మాట్లాడుతూ... రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఈ ధరలకు చట్టబద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రామక్రిష్ణ పాల్గొన్నారు.



టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిని సత్కరిస్తున్న నాయకులు

విద్యా కమిటీలలో దళితులకు ప్రాధాన్యం

ముదిగుబ్బ, ఆగస్టు 9: ముదిగుబ్బ మండల వ్యాప్తంగా గురువారం నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికల్లో అధిక స్థానాలలో దళిత అభ్యర్థులను చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు దళిత సంఘం నాయకులు శుక్రవారం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ హయాంలోనే దళితులకు పెద్దపీట వేశారని, విద్యా కమిటీ ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించారని, తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటామని అన్నారు. అనంతరం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రంగనాయకులు, దొరిగల్లు రామాంజి, నరసింహులు, ఆదినారాయణ, అశోక్, రాజా, రవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : జిల్లా కేంద్రంలో సీజనల్ వ్యాధులు, ఆరోగ్యవంతమైన జీవనంపై జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసీకే నాయక్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మనాయక్, సూపర్‌వేజర్ రమణయ్య, ఆరోగ్యకార్యకర్త పఠాన్ అజీజ్ ఖాన్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

బుక్కపట్నం : ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తోందని, దీంతో పండ్ల తోటల సాగు లాభదాయకం కానుందని ఎంపీడీఓ శ్రీనివాసులు ఓ ప్రటకనలో తెలిపారు. మండలంలోని మామిడి రైతులు మొక్కలు నాటడానికి ఉపాధి పథకం కింద గుంతలు తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవా లన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి, ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, వన్‌బి, రేషన్‌కార్డు, సన్న, చిన్నకారు ధ్రువీక రణపత్రం, జాబ్‌కార్డు జిరాక్సులను వీల్డు అసిస్టెంట్‌కు అందించాలన్నారు.

పింఛన్ ఇప్పించండి అయ్యా..!



వృద్ధురాలు చిన్నమ్మ

నల్లమాడ, ఆగస్టు 9: 'అయ్యా.. నాకు 80 ఏళ్లు. మూడు సంవత్సరాల క్రితం భర్త కూడా చనిపోయాడు. దయచేసి నాకు వృద్ధాప్య.. లేక.. వింతంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి..' అని మండలంలోని తిప్పయ్యగారిపల్లికి చెందిన ఓ వృద్ధురాలు చిన్నమ్మ వేడుకుంటోంది. ఈమె 20 యేళ్ల క్రితం బుక్కపట్నం మండలంలోని కొత్తకోట నుంచి ఈ ప్రాంతానికి భర్తతో పాటు వలస వచ్చింది. తిప్పయ్యగారిపల్లి పూరిగుడిలో ఉండేవారు. మూడు సంవత్సరాల కితం భర్త చనిపోయాడు. అప్పటి నుంచి చిన్నమ్మను ఆమె కుమార్తె చూసుకుంటోంది. ఆధార్, రేషన్‌కార్డులో ఆమె 1966లో పుట్టినట్లు తప్పుగా నమోదైంది. దీంతో ఆమెకు 80 ఏళ్లు ఉన్నా.. ఇంకా 58 ఏళ్లే ఉన్నట్లు ఆ పత్రాలు ఉన్నాయి. తమకు వింతంతు పింఛన్ మంజూరు చేయాలని, లేదా ఆధార్, రేషన్‌కార్డుల్లో తాను పుట్టిన తేదీని మార్చి వృద్ధాప్య పింఛన్ అయినా మంజూరు చేయాలని పలుమార్లు వైసీపీ నాయకులను, అధికారులను వేడుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదని చిన్నమ్మ వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తనకు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కదిరి అర్బన్, ఆగస్టు 9: తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. కదిరి మండలంలోని ఎర్రదొడ్డి తండాకు చెందిన లక్ష్మీదేవి, ఇదే మండలంలోని రాచువారిపల్లి తండాకు చెందిన మల్లికార్జున వివాహం 2009లో జరిగింది. నాలుగు సంవత్సరాల క్రితం అతను ముదిగుబ్బకు చెందిన ప్రియాంకను రెండో వివాహం చేసుకున్నాడు. మల్లికార్జున తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు మల్లికార్జున, ప్రియాంకపై కేసు నమోదు చేశారు.

12 నుంచి సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు శిక్షణ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 9: సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు సాలీడ్ వెస్ట్ మేనేజ్ మెంట్, శ్యానిటేషన్ పైన ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు పర్యవేక్షకుడు పూల రెడ్డెప్ప తెలిపారు. కావున ఈ శిక్షణకు కార్యదర్శులు, సర్పంచ్‌లు 12వ తేదీన ఉదయం 9గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

కదిరి, (అమడగూరు) : అమడగూరు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14 వరకు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వాహణ, అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ అశోకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తామని, ఈ శిక్షణకు సర్పంచ్, కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని అన్నారు.

నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు



తహసీల్దార్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 9 : ధర్మవరం నూతన తహసీల్దార్ నటరాజను శుక్రవారం టీడీపీ నాయకులు కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిసే సుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమినేని ప్రసాద్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌చౌదరి, జంగం నరసింహులు, అశోక్‌వాల్మీకి, చింతా నాగార్జున, అంజి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



కదిరి అర్బన్, ఆగస్టు 9: కదిరి మండల నూతన తహసీల్దార్‌గా మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ పుల్లారెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా శాంతిపురం తహసీల్దార్ మురళీక్రిష్ణ ఇక్కడికి వచ్చారు.

విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు

నల్లమాడ, ఆగస్టు 9: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాలలోని భోజన గది, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ మీనాక్షి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు సతీష్, వార్డెన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉత్సాహంగా ఆటల పోటీలు

కొత్తచెరువు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ సహకారంతో బాలికల ఆటల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. ఈ క్రీడాపోటీలకు బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు 120 మంది పాల్గొన్నారు. ఈ క్రీడలలో లాంగ్‌జంప్‌లో మేఘన, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రత్యూష, షాట్‌పుట్‌లో కీర్తన మొదటి బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ సంజీవరెడ్డి, పీడీ వెంకటేష్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



విజేత విద్యార్థులతో పీడీలు, ఆర్డీటీ ఏటీఎల్

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

మడకశిర రూరల్, ఆగస్టు 9: నియోజకవర్గంలో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆమిదాగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటించారు. 10న దేవస్థాన ప్రాంగణంలో గంగపూజ, గోపూజ, విగ్రహాల సంప్రోక్షణం, యాగశాల ప్రవేశం, గణపతిపూజ , బిలిపీఠస్థాననం, హోమాలు, 11న పంచామృత, పుణ్యనదీతీర్థ స్నానం అగ్ని ప్రతిష్ఠాపన హోమములు, 12న నూతన విగ్రహములు ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, జయాధిహోమములు, పూర్ణాహుతి అలంకారములు, విమాన గోపురకలశ స్థాపన, కుమభాభిషేకం, ధ్వజ స్థంభపూజలు, మహామంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ధర్మస్థళ ధార్మాధికారి డి.వీరేంద్ర హెగ్డే, రామకృష్ణ సేవా శ్రమ జపానందస్వామీజీ, ఎంపీ పార్థసారథి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, విచ్చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా తైలాభిషేక పండుగ

పెనుకొండ, ఆగస్టు 9 : స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో శుక్రవారం పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో 'తైలాభిషేకం' పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చికి వచ్చిన భక్తులకు అభిషేక తైలం పోసి ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ టౌన్ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, ఆంద్రూస్, మండ్లి గ్రామ మాజీ సర్పంచ్ బైలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


వెంకటేష్, తహసీల్దార్

హిందూపురం అర్బన్, ఆగస్టు 9: హిందూపురం తహసీల్దార్‌గా వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎన్నికల సమయంలో మడకశిరకు బదిలీపై వచ్చారు. ఇటీవల ఆయన్ని పురానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహిస్తానన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

హిందూపురం అర్బన్, ఆగస్టు 9: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని పూలకుంట సర్పంచ్ మంజునాథ్, టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలకన్నా బిడ్డకు మంచి ఆహారం ఏదీ లేదన్నారు. తల్లి పాలలో బిడ్డకు కావాలసిన పౌష్టికాహారం పుష్కలంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాతి, జయమ్మ, సరస్వతి, అనిత అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరుకాలేదని ఇద్దరికి రిమాండ్

పెనుకొండ రూరల్, ఆగస్టు 9: కోర్టుకుహాజరు కాలేదని పెనుకొండ మెజిస్ట్రేట్ ఇద్దరికి 15రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. మరువపల్లి గ్రామానికి చెందిన గొల్ల నారాయణ, నాగరాజు మార్చి 17న అక్రమంగా సీడీలు విక్రయిస్తుంటే కాపీరైట్ యాక్ట్‌కింద కేసు నమోదుచేశారు. కోర్టుకు సరిగా హాజరు కాక పోవడంతో ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ సయ్యద్ ముజీబ్ 15రోజుల రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు


చెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఆగస్టు 9: చెరువులు, కుంటల్లో మట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్నారు. శుక్రవారం లేపాక్షి, చిన్న చెరువు నుంచి జటాయువు పక్షి వద్దకు ఐదు ట్రాక్టర్లలో యథేచ్ఛగా మట్టిని తరలించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు పంట పొలాలకు తోలుకోవాలంటే పర్మిషన్ లేదంటూ వాహనాలను నిలిపివేసి నానా హంగామా చేసే అధికారులు లేఅవుట్లకు మట్టిని తరలిస్తుంటే నోరు మెదపడంలేదు. దీనిపై సంబంధిత అధికారులు ముడుపులు తీసుకున్నారని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. పోలీసులకు సమాచారం అందించినా స్పందించలేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం : నాగరత్నమ్మ, ఇరిగేషన్ ఏఈ

లేపాక్షి చెరువు నుంచి ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నారన్న సమాచారం అందింది. మేము ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులు, జేసీబీ యజమానిపై చర్యలు తీసుకుంటాం.

ముగిసిన ఆర్డీటీ అథ్లెటిక్స్ పోటీలు


లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థిని

పెనుకొండ, ఆగస్టు 9 : ఆర్డీటీ ఆధ్వర్యంలో రూరల్ బాలికల అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న హైస్కూల్ బాలికలు అండర్-14, అండర్-16 విభాగాల్లో 60, 100, 200మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ ఈవెంట్స్‌నందు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ రాజేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ హాజరై బహుమతులు అందజేశారు. ఆర్డీటీ సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలైన ప్రథమ, ద్వితీయ క్రీడాకారులు అనంతపురంలో జరిగే పోటీలకు అర్హత పొందినట్లు తెలిపారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

పెనుకొండ, ఆగస్టు 9: పట్టణ సమీపంలోని కొండాపురం గ్రామంవద్ద వెలసిన లక్ష్మీకాంత తీర్థుల ఆరాధనోత్సవాలను శనివారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాలూరి క్రిష్ణమూర్తి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం పూర్వారాధన, ఆదివారం మధ్యారాధన, సోమవారం ఉత్తరారాదన నిర్వహిస్తామన్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పవమాన హోమాలు, అన్నసంతర్పణ నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.

వింతవ్యాధితో మృత్యువాతపడుతున్న గొర్రెలు

గుడిబండ, ఆగస్టు 9: మండలంలో పలు గొర్రెలకు వ్యాధులు సోకి మృత్యువాత పడుతున్నారు. కాపాడేందుకు పశువైద్యాధికారులు అందుబాటులో ఉండటం లేదని గొర్రెల కాపర్లు వాపోతున్నారు. మండలంలోని ఎస్. రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, మేకలగట్ట, తదితర గ్రామాల్లో గొర్రెలు, మేకలు జ్వరాల భారిన పడి చనిపోతున్నాయి. దీంతో కాపర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కాపర్లు కోరుతున్నారు.

బాగు చెయ్యండి ప్లీజ్..!

యాడికి : చూస్తున్నారు కదా..? ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో..! యాడికి నుంచి బుగ్గకు వెళ్లే రోడ్డు, రాయలచెరువు నుంచి చందనకు, అక్కడి నుంచి దైవాలమడుగు వరకూ వెళ్లే రోడ్డు, యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే రోడ్డు, తూట్రాళ్లపల్లి నుంచి నగరూరుకు వెళ్లే రోడ్డు.. ఏ దారి చూసినా గుంతలమయమే. వర్షాలు కురవగానే చిన్నపాటి నీటి మడుగులుగా మారుతాయి. ఆ తరువాత బురదగుంతలుగా తయారౌతాయి. ఎండకాచి ఆరిపోయిన తరువాత.. దుమ్ము రేగుతాయి. ఇలా ఒకదాని తరువాత ఒక విపత్తు వాహనదారులకు ఎదురౌతూనే ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా ఆస్పత్రిపాలు కావాల్సిందే. కూటమి ప్రభుత్వం వాటిని సరిచేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. సాధ్యమైనంత త్వరగా ఆ పనిచేసి పుణ్యం కట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సెజ్ భూములు రైతులకే ఇవ్వాలి

రైతు సంఘం నేతల డిమాండ్

మోకాళ్లపై నిలబడి నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

మడకశిరటౌన్, ఆగస్టు 9: పరిశ్రమల పేరుతో మండల పరిధిలోని సి.కొడిగేపల్లి గ్రామం వద్ద సేకరించిన సెజ్ భూములను తిరిగి రైతులకే అప్పగించాలని శుక్రవారం సి.కొడిగేపల్లి గ్రామానికి చెందిన రైతులు, రైతు సంఘాల నాయకులు మోకాళ్లపై నిలబడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న మాట్లాడుతూ 2004 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎస్ఈజెడ్ భూములను 2,200 ఎకరాలు చౌకగా తీసుకొన్నారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, పరిశ్రమ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. 20 సంవత్సరాలు అవుతున్నా పరిశ్రమల ఊసే లేదని, గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా రైతులకు న్యాయం చేయలేదన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయని భూములను తిరిగి రైతులకు అప్పగించాలని, ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేసి పన్‌బీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం పేరుతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు సీఆర్ వెంకటరెడ్డి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, యోగానంద్, చౌడప్పతో పాటు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఆగస్టు 9 : పట్టణంలోని బాలాజీ నగర్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. శుక్రవారం రొళ్ల మండలం కాకి పంచాయతీకి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. సీఎం చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నరసింహప్ప, గంగాధర్, నాయకులు కృష్ణమూర్తి, తిమ్మప్ప, ఈరనాగప్ప, తిమ్మరాజు, వెంకటేష్, హనుమంతు, వెంకటప్ప, దొడ్డరామప్ప, రంగస్వామి, శివశంకరప్ప, రమేష్ తదితరులున్నారు. అమరాపురం మండల కేంద్రంలో వైసీపీకి చెందిన వార్డు మెంబర్‌లు మంజు, ఈరలింగప్ప, నాయకులు రఫీక్, ఈరభద్రప్ప తోపాటు మరో 20 మంది తెలుగుదేశం పార్టీలోకి చేరారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి

పెనుకొండ, ఆగస్టు 9: నాగపంచమి వేడుకలను పలు ప్రాంతాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండగ సందర్భంగా మహిళలు తలంటు స్నానాలుచేసి ఇళ్లలో, ఆలయాల్లో నాగ ప్రతిమలకు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయనాలు సమర్పించి సుబ్రహ్మణ్యేశ్వరుడికి నోములు నిర్వహించారు.

పెనుకొండ రూరల్: శ్రావణమాసం పురస్కరించుకుని నాగపంచమిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాగులకట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

తొలి శుక్రవారం సందడి

హిందూపురం అర్బన్: శ్రావణ మాసం తొలిశుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో సందడి నెలకొంది. హిందూపురం పట్టణ పరిధిలోని డీబీ కాలనీలో నెలకొన్న అష్ట లక్ష్మీ ఆలయంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్చిదిద్దారు.


అలంకరణలో లక్ష్మీ అమ్మవారు

ట్యాంకర్ కింద పడి చిన్నారి దుర్మరణం


చిన్నారి జునైద్ (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 9: శుద్ధనీరు సరఫరా చేసే ట్యాంకర్ కింద పడి ఏడాదిన్నర వయసున్న చిన్నారి మృతిచెందడం కంటతడి పెట్టించింది. పట్టణంలోని మోడల్ కాలనీ పెద్దమసీదు సమీపాన శుద్ధనీరు సరఫరా చేసే ట్యాంకర్ వెళ్తోంది. ఆ ప్రాంతంలో నివాసముంటున్న బాబాజాన్ భార్య షబ్రీన్ నీటిని పట్టుకోవడానికి ఇంటి ముందుకొచ్చింది. ఆమెతోపాటు చిన్న కుమారుడైన ఏడాదిన్నర వయసున్న చిన్నారి జునైద్ కూడా వచ్చాడు. ఆమె నీటి బిందె పట్టుకుని, ఇంటిలోకి వెళ్లింది. చిన్నారి బయటే ఉండిపోయాడు. నీటి ట్యాంకరు కదిలే సమయంలో చిన్నారి వెనుక చక్రాల కింద పడి తల ఛిద్రమై, అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు కేకలు వేయగా.. ట్యాంకర్ ముందుకు వెళ్లిపోయింది. తల్లి బయటకు వచ్చి చూసేసరికి చిన్నారి విగతజీవుడయ్యాడు. టూటౌన్ పోలీసులు మోడల్ కాలనీకి వెళ్లి, ట్యాంకర్ డ్రైవర్ సైఫుల్లాను అదుపులోకి తీసుకున్నారు. ట్యాంకర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అప్పటి వరకు కళ్లముందు ఆడుకుంటున్న బిడ్డ ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. సైఫుల్లాకు డ్రైవింగ్ లైసెన్స్ లేదని తెలిసింది.


ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబు

● బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కార్యదర్శి రవిభూషణ్



రొళ్ల, ఆగస్టు 9 : ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమని మాజీ డీఎల్ఓ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కార్యదర్శి రవిభూషణ్ విలేకరులతో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన 60 రోజుల్లోగా ఉద్యోగుల జీతాలు, పింఛన్లు సకాలంలో ఇస్తూ, ధూప, దీప నైవేద్యం పథకానికి రూ.10వేలకు జీఓ పెంచడం అభినందనీయమన్నారు. అర్చకులు, బ్రాహ్మణ సమాజం తరపున కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీధర్, రవి, ఫణి, గోవిందరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా వర్సిటీ ఫెలోషిప్‌కు పురం విద్యార్థి ఎంపిక


ఉదయ్ దుర్గాప్రసాద్

హిందూపురం అర్బన్, ఆగస్టు 9: పట్టణానికి చెందిన సురేష్, రాజేశ్వరి దంపతుల కుమారుడు ఉదయ్‌దుర్గాప్రసాద్ అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయంలో ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. బెంగళూరులోని మహాత్మాగాంధీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ కోర్సులో పీజీ చేశారు. ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించాడు. అమెరికా జార్జియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరచి, అర్హత సాధించాడు. ఫెలోషిప్‌కు ఎంపిక చేసినట్లు వర్సిటీ నుంచి సమాచారం అందిందని విద్యార్థి తండ్రి సురేష్ తెలిపారు. మొక్కలకు సోకే వ్యాధులు, వాటి నివారణపై విజయ్ దుర్గాప్రసాద్ పరిశోధనలు చేస్తాడన్నారు.

వైసీపీ నాయకుల అవినీతి కనిపించలేదా?

సామాజిక తనిఖీ బృందాన్ని నిలదీసిన టీడీపీ నాయకులు

బత్తలపల్లి, ఆగస్టు 9: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023 నుంచి 2024 వరకు రూ.5.74 కోట్ల పనులు చేపడితే.. కేవలం రూ.2.66 లక్షల అవినీతి మాత్రమే జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందనీ, వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడినా కనిపించలేదా అని అధికారులను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని గ్రామాల్లో పది రోజులుగా సామాజిక తనిఖీ బృందం ఉపాధి హామీ పనులను పరిశీలించింది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. రూ.2.66 లక్షల అవినీతి జరిగినట్లు చెప్పారు. దీనిపై టీడీపీ నాయకులు సదాశివ, పోతు లక్క, రమణ, మనోజ్ మండి పడ్డారు. వారు మాట్లాడుతూ.. బత్తలపల్లి ఉపసర్పంచ్‌తోపాటు అతని కుటుంబ సభ్యులకు కూలి పనులకు వచ్చినట్లు ఎలా బిల్లులు ఇచ్చారని ప్రొసీడింగ్ ఆఫీసర్ శివశంకర్, ఏపీఓ ఆదెప్పను ప్రశ్నించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో అవినీతిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలను అధికారులకు చూపుతూ.. టీడీపీ నాయకులు ఓబుళనాయుడు, బాలాంజనేయులు నిలదీశారు. చేసిన పనులకే మళ్లీ బిల్లులు ఎలా చేస్తారని, ఉద్యోగులు, రాజకీయ నాయకులను కూలీలుగా ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఇన్ని అక్రమాలు జరిగినా... సామాజిక తనిఖీ బృందం గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వీటిపై కలెక్టర్, ప్రొసీడింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, నాగభూషణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం..

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్


సభ్యత్వం తీసుకుంటున్న ఉద్యోగులు

అగళి/మడకశిర (అమరాపురం) ఆగస్టు 9: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం) జిల్లా అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. అగళి ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అమరాపురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కూడా ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. పలువురు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమాల్లో సంఘం ఉపాధ్యక్షుడు గోవిందప్ప, మడకశిర తాలూకా అధ్యక్షుడు భూతేగౌడ్, కార్యదర్శి రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు త్యాగరాజ్‌స్వామి, సెక్రెటరీ నటరాజ్, ట్రెజరర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బుద్ధదేవ్‌కి నివాళి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 9: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ మృతికి స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. పెద్దన్న, వెంకటేశులు, రామక్రిష్ణ, నాగరాజు, పండు వెంకటేశులు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


బుద్ధదేవ్‌కి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పోస్టర్ల విడుదల

పెనుకొండ, ఆగస్టు 9: ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం పోస్టర్లను జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంపదను పునఃపంపిణీ చేయాలనీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలనీ, నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలనీ, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ, మున్సిపల్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, కార్మికులపై వేధింపులు ఆపాలన్న డిమాండ్లతో విశాఖ పట్టణంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్, మణి, గజేంద్ర, బావక్క, మహేష్, కాంతమ్మ పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు సిద్ధమైన పావగడ


అలంకరణలో శనేశ్వరుడు

పావగడ, ఆగస్టు 9: శ్రావణ శనివారం సందర్భంగా పావగడ శనీశ్వరుడి ఆలయం సిద్ధమయ్యింది. భారతదేశంలో పేరుగాంచిన కర్నాటకలోని తుమకూరుజిల్లా పావగడలోని శనేశ్వరీ ఆలయం శ్రావణమాసంలో దర్శించుకుంటే సకల పాపాలు వైదొలుగుతాయన్న నమ్మకం ఇక్కడి భక్తుల అపార నమ్మకం. శనివారం ఉదయం 4.30కు జ్యేష్ఠాదేవి సమేతుడైన శనేశ్వరుడికి కళశపూజ, గణపతిపూజ, నవగ్రహపూజ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తైలాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తామని కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి తెలిపారు.

సమష్టిగా పురాన్ని అభివృద్ధి చేద్దాం

● టీడీపీ పట్టణ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న టీడీపీ పట్టణ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఆగస్టు 9: మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు కలిసి హిందూపురాన్ని అభివృద్ధి చేసుకుందామని టీడీపీ పట్టణ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాలకు పన్ను వేయాలన్నారు. పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ బాలసుబ్రహ్మణ్యం, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు శిక్షణ

హిందూపురం అర్బన్, ఆగస్టు 9: విద్యార్థి దశ నుంచే దేశంపట్ల సమాజంపట్ల, గౌరవం, దేశభక్తి పెంపొందేలా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడులకు జిల్లా కేంద్రంలో విద్యార్థులు నిర్వహించే మార్చ్‌ఫాస్ట్‌కు స్థానిక చిన్మయా విద్యాలయంలో గత నాలుగు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. హిందూపురం, పూలకుంట, పులమతి, మోద, లేపాక్షి జవహర్‌నవోదయ తదితర ప్రాంతాల నుంచి 150 మంది ఎస్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో గిరిధర్, నాగరాజు, బొమ్మన ప్రసాద్, మహ్మద్ ఇక్బాల్, స్కౌట్ క్యాంప్ ఆఫీసర్ రామకృష్ణ, నాగరాజు, స్కౌట్ మాస్టర్ వెంకటరామప్ప, నారాయణస్వామి, అశ్వర్థనారాయణ, మహేష్‌బాబు, చిన్మయ పీఈటీ శైలజ, రోజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


పుస్తకాలతో విద్యార్థులు

హిందూపురం(పరిగి), ఆగస్టు 9: సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా మండలంలోని గొరవనహళ్లి ప్రాథమిక పాఠశాలలో 120మంది విద్యార్థులకు అభిమానులు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతలక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది మల్లికార్జున, సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం నాయకులు ఉన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

గోరంట్ల, ఆగస్టు 9: మండలంలోని బుడ్డపల్లి గ్రామానికి చెందిన వడ్డె గౌతమి (25) పాముకాటుకు గురై శుక్రవారం మృతి చెందింది. బుడ్డపల్లి సుధాకర్ భార్య గౌతమి గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా కుడిచేతిపై నాగు పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కర్ణాటకలోని బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆసుప్రతిలో చికిత్స పొందుతూ గౌతమి శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త సుధాకర్ ఫిర్యాదుకు కేసు నమోదు చేశామన్నారు.

తాగునీటి బోరు కేబుల్ చోరీ

మడకశిర(అమరాపురం), ఆగస్టు 9: మండల పరిధిలోని హలుకూరు గ్రామానికి చెందిన తాగునీటి బోరు కేబుల్‌ను పలుమార్లు చోరీకి గురికావడం, పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. దీంతో గ్రామంలో తాగునీటి కొరతతో ప్రజలు విలవిలలాడుతున్నారు. గురువారం రాత్రి మరోసారి తాగునీటి బోరుకు అమర్చిన కేబుల్ చోరీ అయినట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే ఇలా చేస్తున్నారంటూ స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 9: అమరాపురం మండల పరిధిలోని బసవనపల్లి పంచాయతీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆరోనపల్లి తండాలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం గతంలో టీడీపీ ప్రభుత్వంలో గిరి గోరుముద్దలు, పోషకాహారం బుట్టలు, ఫీడర్ అంబులెన్స్‌లు, డయాలసిస్ కేంద్రాలు, 50 ఏళ్లకే పింఛన్లు వంటి ఎన్నో పథకాలను అమలు చేసిందని ఈసందర్భంగా పేర్కొన్నారు. పోడు భూములపై హక్కు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. యువకుల ఉపాధి కోసం ఇన్నోవా కార్లు ఇచ్చారన్నారు. ఏజెన్సీ ఉద్యోగాలు స్థానికులకే చెందేలా జీవోనెంబర్-3 ను తెలుగుదేశం పార్టీ తీసుకొని వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, మండల కన్వీనర్ గణేష్ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, పరమేశ్వరప్ప, శివరుద్రప్ప, నవీన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి) : మండల పరిధిలోని చిన్నప్పల్లి గ్రామంలో శుక్రవారం మండల అధికారుల ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ హక్కులు, సంస్కృతి, సంప్రదాయం, యువతకు గిరిజన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఎంఈఓ లక్ష్మీదేవి, డాక్టర్. స్వరూపరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి అరుణ, ఇతర అధికారులు, సిబ్బంది గ్రా ప్రజలు పాల్గొన్నారు.

గోరంట : పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్స శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీపీఓ, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఆదివాసీ ప్రజల సమగ్రాభివృద్ధి గురించి వివరించారు. గిరిజన బాలికలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓఆర్‌డీ సుధాకర్, కార్యదర్శి బాబురావు, ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, బాలికలున్నారు.

పెనుకొండ : స్థానిక గిరిజన వసతి గృహంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి.

అన్నదానం

పెనుకొండ రూరల్, ఆగస్టు 9 : ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని వైద్యాధికారి నాగరాజునాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన 70మంది గర్భిణులకు మంత్రి సవిత ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు వారు తెలిపారు.